భూసేకరణలో గిరిజనులకు అన్యాయం

- పునరావాస కాలనీలకు దూరంగా భూముల కేటాయింపు
- అంతదూరం వెళ్లి సాగు ఎలా చేయాలంటున్న గిరిజన రైతులు
- ఈ భూములనే గిరిజనేతరులు వేరొకరికి కౌలుకు ఇస్తున్నారని గగ్గోలు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన


తనకు ఇచ్చిన భూమిలో గిరిజనేతర రైతు గతేడాది మిర్చి పంటవేశాడని చూపుతున్న నిర్వాసిత గిరిజన రైతు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణలో తమ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అధికారులు తమకి తీరని అన్యాయం చేశారని విలీన మండలాలకు చెందిన గిరిజన నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న భూములను అప్పటి టీడీపీ ప్రభుత్వం సేకరించింది. ఈ భూసేకరణలో గిరిజనేతరుల భూములను కొనుగోలు చేసి ఆ భూములను భూపరిహారం కింద భూమికి భూమిగా గిరిజనులకు అందించింది. అయితే ఇప్పుడు గిరిజనేతరులు తమకు పరిహారం అందలేదని చెప్పి తిరిగి ఆ భూములను వారే రూ. 30 నుంచి రూ.50 వేలకు కౌలుకు ఇచ్చుకుంటున్నారు. దీంతో ప్రాజెక్టు భూసేకరణలో భూమి పోవడమే కాకుండా ప్రభుత్వం భూపరిహారంలో ఇచ్చిన భూమిని కూడా సాగుచేసుకొనే పరిస్థితి తమకు లేకుండా పోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రస్తుతం తాము ఉంటున్న పునరావాస కాలనీలకు సుమారు 10 కి.మీ. దూరంలో ఈ భూములను కేటాయించారని చెబుతున్నారు. భూసేకరణలో గిరిజనుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని వాపోతున్నారు. గిరిజనేతరులు తమ భూములను కౌలుకు ఇస్తున్న విషయం అధికారులకు తెలిసినా వారికే వత్తాసు పలుకుతున్నారని గిరిజన సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు కలుగచేసుకొని నిర్వాసిత గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మా భూముల్లో సాగు చేయలేని పరిస్థితి



రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాకు 10 కి.మీ దూరం లోని పెద్దరావిగూడెం గ్రామంలో భూపరిహారం కింద భూమి ఇచ్చారు. అంతదూరం రోజూ వెళ్లి వ్యవసాయం ఎలా చేయాలి. ఈ విషయంపై అధికారులు పునరాలోచించాలి.

– పొడియం వేణుగోపాల్, రెడ్డిగూడెం, కుక్కునూరు

సాగుకు అనుకూలంగా లేవు



2017లో జరిగిన భూసేకరణలో రెడ్డిగూడెం గిరిజనుల రైతులకు భూపరిహారంగా 10 కి.మీ దూరంలోని పెద్దరావిగూడెం పంచాయతీలో భూమి కేటాయించారు. ఆ భూములు కూడా వ్యవసాయానికి అనుకూలంగా లేవు. ఈ విషయమై ఐటీడీఏ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు న్యాయం జరగలేదు.

– పైడా పరమేష్, నిర్వాసిత గిరిజన రైతు, రెడ్డిగూడెం, కుక్కునూరు

న్యాయం చేయకుంటే కమిషన్‌ను ఆశ్రయిస్తాం



పోలవరం భూసేకరణలో గిరిజనులకు తీరని అన్యాయం జరిగింది. గిరిజనులకు జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనులకు భూమికి, భూమి కింద ఇచ్చిన భూములను గిరిజనేతర రైతులు పరిహారం పొంది కూడా కౌలుకు ఇచ్చుకుంటున్నారు.

– కూరం సంజీవరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు

ఉన్నతాధికారులు న్యాయం చేయాలి



పోలవరం ప్రాజెక్టుకు భూములు ఇచ్చి బాధపడుతున్న మాలాంటి వారు దాదాపు ముప్పై మంది వరకు ఉన్నారు. మిగిలిన గిరిజన గ్రామాలకు చెందిన నిర్వాసిత గిరిజన రైతుల పరిస్థితి కూడా ఇంతే. గిరిజనులకు జరిగిన అన్యాయంపై అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– పైడా బొర్రయ్య, నిర్వాసిత గిరిజన రైతు, కుక్కునూరు

క్లుప్తంగా

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో శ్రీవారు

జంగారెడ్డిగూడెం: కార్తీక మాసం మూడో శనివారం కావడంతో స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని విశేషంగా అలంకరించి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, అయ్యప్ప స్వాములు, భవానీలు, గోవిందస్వాములు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పెనుగొండకు చెందిన ఇండిపికాయల శ్రీనివాస్, లీల వెంకట పద్మావతి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ నెల 20వ తేదీన పారిజాతగిరిలో సామూహిక రమా సత్యనారాయణస్వామివారి వ్రతం వేద పండితుల సమక్షంలో నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

మద్ది క్షేత్రానికి పాదయాత్ర


కన్నాపురం నుంచి మద్ది క్షేత్రానికి పాదయాత్ర చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం మద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు శనివారం పాదయాత్ర నిర్వహించారు. కన్నాపురం పంచాయతీ పరిసర గ్రామాలకు చెందిన సుమారు వందమందికి పైగా భక్తులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. పులి రామన్నగూడెం శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గురువాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయం వరకు 17వ సారి మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. అర్చకులు తాడికొండ నరసింహమూర్తి, ఆలయ ధర్మకర్త గడి గోవింద్, అయ్యప్ప మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

వేదోక్తంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో 69వ చండీహోమంను అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం లక్ష దీపోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) కోరారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పీవీ.కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా సభ్యులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట: బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాధ్యతలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూలా, ఎంఈఓలు డి.సుబ్బారావు, ప్రశాంత్ కుమార్, సూపర్‌వైజర్లు మంగాదేవి, వీరకుమారి, హెచ్ఎం.గస్‌బాబు, రాధ పాల్గొన్నారు.

కారు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టి..

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో కారును కిరాయికి తీసుకుని తాకట్టుపెట్టిన వ్యక్తిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు బీడీ కాలనీ ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన నెరుసు శివకృష్ణ కార్లను అద్దెకు తిప్పుతూ ఉంటాడు. ఏలూరు పుష్పలీలా నగర్ ప్రాంతానికి చెందిన ముంగర అభిషేక్ అనే వ్యక్తి శివకృష్ణకు చెందిన మారుతీ ఎర్టిగా కారును నెలకు కిరాయికి మాట్లాడుకున్నాడు. నెలకు రూ.40 వేలు ఇస్తానంటూ కారును ఈ ఏడాది ఆగస్టు 18న తీసుకువెళ్లాడు. ఎంతకాలమైనా అద్దె చెల్లించకపోగా, కారును వేరొకరికి తాకట్టు పెట్టినట్టు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

20న రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 20వ తేదీన రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బొబ్బిలి సూర్యచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ హాజరై, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.

నిర్వాసితులను నిండా ముంచుతున్న ప్రభుత్వం

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను ప్రభుత్వం నిండా ముంచుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి విమర్శించారు. వేలేరుపాడు మండలంలోని కొత్తూరు గ్రామంలో సీపీఎం తొమ్మిదవ మండల మహాసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్ కేటాయించారే తప్ప నిర్వాసితులను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గుమ్మల వెంకట నరసయ్య, జిల్లా నాయకులు దుర్గారావు, కారం వెంకట్రావు, కుంజా దుర్గ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


కొయ్యలగూడెం: గ్రంథాలయంలో నేతలకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు


లింగపాలెం: ధర్మాజీగూడెంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు

కొయ్యలగూడెం: గ్రంథాలయ 57వ జాతీయ వారోత్సవాలు శనివారం స్థానిక కన్నాపురం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్, పాతూరు నాగభూషణం, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు విద్యార్థులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 3వ రోజు శనివారం కొనసాగాయి. ఉద్యమ నేతలు డాక్టర్ ఎస్ఆర్ రంగనాధన్, పాతూరి నాగ భూషణం, అయ్యంకి వెంకట రమణయ్యల గురించి గ్రంథాలయాధికారి పి.దుర్గారావు వివరించారు. అనంతరం కేవీ విశ్వనాథ్ పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జె.ప్రసాద్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉద్యమ నేతలకు నివాళులర్పించారు. అనంతరం సమాజంలో జర్నలిస్టులు పాత్ర అనే అంశంపై ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ చైర్మన్ షేక్ ఇబ్రహీం, గ్రంథ పాలకులు భీమరాజు, డాక్టర్ రామకృష్ణ, బిరుదుగడ్డ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన గనులు

లింగపాలెం: గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ధర్మాజీగూడెం పంచాయతీ కార్యదర్శి కె.స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయాలో శనివారం ఉద్యమ ప్రముఖులు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప, గురుకులం ఉపాధ్యాయురాలు గోదాదేవి, శ్రీవారి దేవస్థానం హైస్కూల్ ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా

కొయ్యలగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలంటూ సీపీఎం నేతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ మహిళలు, దళితులపై దాడులు అరికట్టాలని, పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, అర్హులైన నిరుపేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దర్ కార్యాలయంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఆకుల దుర్గారావు, జగన్నాథం, దుర్గమ్మ, ముప్పిడి మౌనిక, మంచిరాజు, సూరమ్మ, పూలపల్లి సంధ్యారాణి, పొగడాల నాగేంద్ర, పులపాకుల పోచమ్మ, గెల్లా నాగరత్నం, చెరుకూరి మరిడయ్య, ఎన్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ రమేష్


సర్వసభ్య సమావేశంలో ఎండోమెంట్ అధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: దేవాలయ భూముల ఆక్రమణలపై వెంటనే చర్య తీసుకోవాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ మండల అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, హౌసింగ్ శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలపై స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దేవాలయ భూములు కబ్జాలకు గురవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఎండోమెంట్ అధికారినీ టీ లక్ష్మిని నిలదీశారు. స్థానిక కొత్తూరు చెక్ పోస్ట్ సెంటర్‌లోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయ భూమి 97 సెంట్లు భూమి ఉందని, దానిలో 39 సెంట్లు స్థలాన్ని లీజుకి ఇవ్వగా, మిగిలిన 58 సెంట్ల స్థలంలో నిబంధనలు ఉల్లంఘించి భూ కబ్జాదారులు అక్రమ కట్టడాలు నిర్మించినా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సరళకుమారి, ఎంఈఓ డి.సుబ్బారావు, వివిధ శాఖల మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

'సాగునీటి' ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలి


శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

పోలవరం రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని తహసీల్దార్ ఆర్ఎస్.రాజు అన్నారు. పోలవరం మండల సమాఖ్య కార్యాలయంలో సాగునీటి సంఘ ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులకు శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, సాగునీటి సంఘాల ప్రాముఖ్యత తదతర విషయాలపై ఎన్నికల మాస్టర్ ట్రైనర్ ఉప్పే మహాలక్ష్మయ్య వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కొవ్వాడ కాలువ డీఈ సుజాత, మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

బిర్సా ముండా పోరాటం చిరస్మరణీయం


బుట్టాయగూడెంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన హక్కుల సాధన కోసం బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని ఏపి గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అన్నారు. బుట్టాయగూడెంలో బిర్సా ముండా జయంతి సందర్భంగా గిరిజన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించే వరకూ పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. ట్రైబుల్ అడ్వైజర్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని, టీఏసీ భవనాన్ని నిర్మించాలని కోరారు. అలాగే గవర్నర్ షెడ్యూల్ ప్రాంతంలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మొడియం శ్రీనివాసరావు, నాయకులు సోదెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం రాముడు, బన్నే బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి లక్షబిల్వార్చన


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించిన దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన చెరువు వీధిలోని శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం స్వామివారికి లక్ష బిల్వార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్ర దీపోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. కార్తీక పౌర్ణమి మరుసటి రోజు ఈ వేడుకలను ఇక్కడ నిర్వహిస్తుంటారు. స్వామి, అమ్మవార్లకు సూపరింటెండెంట్ ప్రసాద్ నీరాజనాలు సమర్పించారు. ఆ తరువాత ఆయన అఖండ దీపాన్ని వెలిగించగా, ఆలయం ముందు రోడ్డు పొడవునా అరటి బోదెలపై ఏర్పాటు చేసిన దీపాలను మహిళా భక్తులు, యువతులు భక్తి ప్రపత్తులతో వెలిగించారు.

బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రికి తరలింపు

వేలేరుపాడు: సోషల్ మీడియాలో టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌లకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడంటూ అరెస్టు చేసిన బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను శుక్రవారం అర్ధరాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి వేలేరుపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శనివారం ఆయన్ని విచారణ చేసిన పోలీసులు.. ఆయనపై ఫిర్యాదు చేసిన టీడీపీకి చెందిన ఉద్దగిరి రాణి అనే మహిళ స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన్ని జంగారెడ్డిగూడెం కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరావు పర్యవేక్షణలో కుక్కునూరు, జీలుగుమిల్లి సీఐలు రమేష్, పి.వెంకటేశ్వరరావు, టి.నర్సాపురం ఎస్సై జయబాబు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరినీ పోలీస్ స్టేషన్ లోపలికి అనుమతించలేదు.

ఆలయాల నిర్వహణను ధార్మిక సంస్థలకు కేటాయించాలి

కుక్కునూరు: ఆలయాల నిర్వహణను ధార్మిక సంస్థలకు కేటాయించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం కుక్కునూరు సాయిబాబా గుడి ప్రాంగణంలో నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో జనవరి 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి స్వయం ప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థకు అప్పగించాలన్నారు. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

చింతలపూడి: జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాలు పత్రికల గొంతు నొక్కే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ మూర్తుజాలిని ఘనంగా సత్కరించారు.

మానవత సాయం

జంగారెడ్డిగూడెం: ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి మానవత సంస్థ ఆర్థిక సహాయం అందించింది. అక్కంపేట గ్రామానికి చెందిన వింజమోరి ఏసురత్నం చెట్టు కొడుతుండగా, ఆ చెట్టుకొమ్మ తలపై పడి గాయపడ్డాడు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి వైద్యఖర్చుల నిమిత్తం మానవత సంస్థ సభ్యులు కలిసి రూ.7,500 అందజేశారు. ఈ మొత్తాన్ని బాధితుడి భార్య వింజమూరి కుమారికి అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: చింతలపూడి మండలం, శివపురం గ్రామంలో పేకాట స్థావరంపై సీఐ ఎం.రవీంద్ర నాయక్ శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.60 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం సీసాలు కలిగిన వ్యక్తులను అరెస్ట్ చేశారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో 11 మద్యం సీసాలతో గుల్లా సాయికుమార్‌ను, జంగారెడ్డిగూడెం దాంగేనగర్‌లో 9 మద్యం సీసాలతో మురాల సీతారామయ్యను, తాడువాయి గ్రామంలో 15 మద్యం సీసాలు కలిగి ఉన్న మరపట్ల రాంబాబు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రాజేంద్రప్రసాద్, ఈఎస్‌టీఎఫ్ ఎస్సై ఎండీ ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన తగరం అశోక్‌చంద్ర పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన గజ్జరం వెళ్లి తిరిగి వస్తుండగా, స్థానిక డిస్టలరీ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌చంద్రను స్థానికులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం, బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంగిడిగూడెం దాబాలో విజిలెన్స్ తనిఖీలు

ద్వారకాతిరుమల: రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబుకు వచ్చిన సమాచారం మేరకు పంగిడిగూడెంలోని ఒక దాబాలో శనివారం తనిఖీలు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నట్టు గుర్తించి 5 సిలిండర్లను అధికారులు సీజ్ చేశారు. అలాగే దాబా యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, సివిల్ సప్లయిస్ డీటీ (ద్వారకాతిరుమల) పి.కామేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.